
24. 9. 2000



# బతుకమ్మ పండగ



"వదినమ్మా!"

హాల్లో కూర్చుని విజయతో మాట్లాడుతున్న ఇందిర ఎవరిదో పిలుపు విని బయటికొచ్చి చూసింది. పక్కింటి రాజేశంగారి భార్య వరలక్ష్మి మెట్లపై నించొని ఉంది.

"మీరా వదినా! అక్కడే నిలుచున్నారేం. లోపలికిరండి" అని ఆహ్వానించింది.

"కరెంట్ లేదేమో. కాలింగ్‌బెల్ మోగుతలేదు వదినమ్మా! అందుకే మీరెవరితోనే మాట్లాడుతున్నట్టున్నరని ఇక్కడ్నే నిలుచున్న" వరలక్ష్మి నవ్వుతూ అంది.

"మీకటువంటి ఫార్మాలిటీస్ ఏం అవసరంలేదు వదినా! డైరెక్టుగా మీరు లోపలికొచ్చేయచ్చు" అని తన పక్కనున్న విజయతో "విజయా! వారు పక్కింట్లో ఉన్న అసిస్టెంట్ ఇంజనీరు రాజేశంగారి మిసెస్" అని వరలక్ష్మితో "విజయ వాళ్ళు మా పక్కవాటాలో కొత్తగా అద్దెకు దిగారు. భార్యాభర్తలిద్దరూ బ్యాంకులోనే పనిచేస్తారు. అని ఒకరికొకరిని పరిచయం చేసింది.

"నమస్తే అండి" నవ్వుతూ పలకరించింది వరలక్ష్మి.

"నమస్తే" ముభావంగా జవాబిచ్చింది విజయ.

"కూర్చోండి" అన్న ఇందిరతో "అబ్బో! చాలా పనుంది. మిమ్మల్ని పసుపు కుంకుమకు పిలవడానికొచ్చిన" అంది.

"ఏంటీ విశేషం" అడిగింది ఇందిర.

"మా సౌమ్యకు తొమ్మిదో సంవత్సరమని చీర కట్టిద్దామని అత్తమ్మ పోరుతుంది. అందుకని ఇవాళ మంచిరోజని కట్టిస్తున్నం. మీరు తప్పక రావాలె, భోజనాలు కూడా అక్కడ్నే." అని విజయకు కూడా బొట్టుపెట్టి "మీరు కూడా రండి" అని చెప్పి వెళ్ళిపోయింది.

"అదేంటి! ఆవిడ ఇంజనీరుగారి భార్య అన్నావు. మరి భాష ఏంటి అలా ఉంది" అంది విజయ ఆశ్చర్యంగా.

"నువ్వు రాజమండ్రి నుండొచ్చావుగా. ఇక్కడి భాష, పరిస్థితులలో అలవాటు పడడానికి కొంత టైం పడుతుంది. మన భాష వాళ్ళకూడా అలాగే అనిపిస్తుందేమో. అయినా, ఆ గొడవెందుకుగానీ సాయంత్రం వాళ్ళింటికి పేరంటానికి వెళదాం, రా" అంది ఇందిర.

"అమ్మో! నేను రాను బాబు, హాయిగా టివి చూస్తూ ఇంట్లో కూర్చోక ఎందుకొచ్చిన తలనొప్పి" విసుగ్గా అంది విజయ.

"ఛ, అలా మాట్లాడతావేంటీ, వాళ్ళెంత మంచివారో తెలుసా. వరలక్ష్మి వాళ్ళ అత్తగారిని చూస్తే అమ్మ గుర్తొస్తుంది. అంత ప్రేమగా మాట్లాడుతుంది. మాకు వాళ్ళ పిల్లలతో సహా అందరితో బాగా చనువేర్పడింది. అసలు ఈ కాలనీలో ఉన్న వాళ్ళందరూ మంచివాళ్ళే. నువ్వొస్తే నీకు పరిచయాలు కూడా ఏర్పడతాయి"-

"ఆ పరిచయాలేవో నువ్వే పెంచుకో. నావసరంలేదు." అంటూ వెళ్ళిపోయింది విజయ.

ఆమె దురుసుతనానికి బాధపడింది ఇందిర. "ఛ. ఆమెను రమ్మనడం నాదే తప్పు" అనుకుంది.

సాయంత్రం రాజేశంగారింట్లో ఫంక్షన్ బాగా జరిగింది. ఇందిరతో వరలక్ష్మి అత్తగారు "ఇందిరమ్మా! ఈసారి బతుకమ్మ పండుగకిక్కడ్నే ఉండాలె. పిల్లలకు సెలవులిస్తరుగదా అని ఊరికి బోతనంటవేమో. అదేం గుదరదు" అంది.

డా. కె. పద్మలత

"తప్పకుండా ఇక్కడే ఉంటాను పెద్దమ్మా! మీకు తెలుసుగదా నాకు బతుకమ్మ పండగంటే చాలా ఇష్టమని. అయినా, అప్పుడే పండగొచ్చేస్తుందా" ఉత్సాహంగా అడిగింది ఇందిర.

"ఆc ఇక నెలరోజులయితే బతుకమ్మలు మొదలేనాయె" వరలక్ష్మి అత్తగారు అంది.

"అంతేనా! అయితే ఇంకేం. మన కాలనీలో బోలెడంత సందడి" అని 'వెళ్ళొస్తా పెద్దమ్మా!' అని చెప్పి ఇంటికొచ్చేసింది.

** ** **

ఇందిర వాళ్ళు వరంగల్ వచ్చి అయిదు సంవత్సరాలు గడిచింది. వచ్చినప్పటి నుండి అదే కాలనీలో, అదే ఇంట్లో ఉండడం చేత అందరితోను పరిచయాలు పెరిగాయి. ఆమెది కలుపుగోలు మనస్తత్వం కావడంతో అందరితోను మర్యాదగా ఉంటూ మంచిపేరు తెచ్చుకుంది. ముఖ్యంగా వరలక్ష్మి వాళ్ళ కుటుంబంతో మరీ ఎక్కువగా కలసి మెలసి ఉంటుంది. బతుకమ్మ పండగొస్తే వాళ్ళతోబాటు తనూ బతుకమ్మలాడుతుంది. బతుకమ్మను పేర్చడం కూడా నేర్చుకుంది. తెలంగాణ పండగలను, పిండివంటలను బాగా ఇష్టపడుతుంది.

అక్టోబరులో పిల్లల స్కూళ్ళకు దసరా సెలవులిచ్చేసారు. ఇందిర వాళ్ళమ్మ పండగకి రమ్మని ఫోన్ చేసింది. అయితే, తాను రానని, ఇక్కడ బతుకమ్మ పండగ బ్రహ్మాండంగా జరుగుతుంది గనుక ఇక్కడే ఉండి, సంక్రాంతికి పిల్లల్ని తీసుకొని వస్తానని తల్లికి చెప్పింది.

** ** **

మహాలయ అమావాస్య రోజు చిన్నగా బతుకమ్మను తయారుచేసింది. కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని ఆవరణలో అందరూ జట్లు, జట్లుగా చేరి బతుకమ్మలను కింద ఉంచి, వాటిచుట్టూ నించొని పాటలు పాడతారు. విజయను కూడా రమ్మని పిలిచింది. తాను రానని, అయినా తమవైపు లేని పండగను ఇందిర చేయడం బాగాలేదని విజయ ఎద్దేవా చేసింది.

"విజయా! ఒకప్పుడు కోస్తా జిల్లాలలోనే ఎక్కువగా చేసే వరలక్ష్మి వ్రతాన్ని ఇప్పుడు తెలంగాణాలో కూడా చాలా మంది చేస్తున్నారు. మనవైపు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చే సంక్రాంతి గొబ్బిళ్ళు ఇక్కడ ప్రతి ఇంటిముందు సంక్రాంతి సమయంలో కనిపిస్తాయి. మహారాష్ట్ర వాళ్ళను చూసి 'వినాయక ఉత్సవాలను', నార్త్ ఇండియన్స్‌ని చూసి 'కాళీ ఉత్సవాలను' ప్రారంభించాం కదా. అలాంటప్పుడు మన రాష్ట్రంలోనే ఒక ప్రాంతంలో అద్భుతంగా ఆచరించే బతుకమ్మ పండగను మనం చేస్తే తప్పేంటి. అసలు బతకమ్మంటే లక్ష్మీదేవి రూపమే అని ఇక్కడ వాళ్ళు తలుస్తారు. అలాంటప్పుడు వరలక్ష్మి పూజ చేసినట్లే, బతుకమ్మ పూజకూడా చేయొచ్చుకదా. పేరేదైనా దైవం ఒక్కటే. భక్తి ఒకేలా ఉంటుంది" ఇందిర ఓపిగ్గా వివరించింది.

"నువ్వెన్నైనా చెప్పు. మనకు లేని ఆచారాలను నేను పాటించను" విసుగ్గా అంది విజయ.

"సరే, నీ ఇష్టం. నాకు మాత్రం బతుకమ్మ పండగంటే చాలా ఇష్టం. అందుకే తొమ్మిదిరోజులు కాకపోయినా, మొదటిరోజు, చివరిరోజు మాత్రం తప్పకుండా బతుకమ్మను తయారు చేసి, పాటలు పాడడానికి వెళ్తాను" అంటూ బతుకమ్మతోసహా వరలక్ష్మి వాళ్ళింటికి వెళ్ళింది. వాళ్ళింట్లో రెండు చిన్న వెదురుపళ్ళేలలో కొన్ని రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చారు.

"పెద్దమ్మా! బతుకమ్మను మరీ చిన్నగా చేసారెందుకు" ఇందిర అడిగింది.

"ఇవాళ ఎంగిలిపూలంటరు బిడ్డా. చిన్నగనే పేర్చాలె. రేపటి నుండి పెద్దగ పేర్చుకోవచ్చు" పెద్దమ్మ చెప్పింది.

"మీరు తొమ్మిదిరోజులు గుడికి వెళ్తారుగదా బతుకమ్మతో" వరలక్ష్మినడిగింది.

"ఆc లేకపోతే అత్తమ్మ కోప్పదుతది"-

"పల్లెటూర్లల్లనయితే ఇవ్వాళటికి తొమ్మిది రోజుల ముందునుండి "బొడ్డెమ్మ"ను గూడా పేరుస్తరు. నిన్నటిదినం



1

**కథ**

బొడ్డెమ్మకు అప్పగింతలు జెప్పి ఇవాళ బతుకమ్మను మొదలుబెడ తరు. మనం కనీసం బతుకమ్మ నన్న తొమ్మిదిరోజులు ఆడకపోతే ఎట్ల" పెద్దమ్మ అంది.

"మరి మనమెందుకు బొడ్డెమ్మను పేర్చట్లేదు" కుతూహలంగా అడిగింది ఇందిర.

"ఎక్కడ బిడ్డా! ఎవరాడుతరు. ఆడ పిల్లలు గూడ పొద్దున లేసిన నుండి ట్యూషన్లని, కాలేజిలని, చదువులని తిరుగుతుండిరి. ఊర్లనయితే బడి నుం డి రాంగనే పిల్లలు సరదాగా ఆడుకునే ది. ఇప్పుడేమయినా టి.వి.ల ముందు కూర్చుంటరుగని, ఆడుకోను బొమ్మంటే పోరైరి. ఆ రోజులు వేరు. ఆ కతవేరు" పెద్దమ్మ నిట్టూర్చుతూ అంది. మొదటి రోజు 'బతకమ్మ సందడి' సరదాగా ముగిసింది. చివరిరోజు కోసం ఇందిర ఎదురు చూస్తుంది.

> విశాలమైన భద్ర కాళి చెరువులో దేదీప్యమానంగా వెలుగుతున్న దీపాలతో, రంగురంగుల పూలతో చేసిన బత కమ్మలు మానవాళికి ఏదో సందేశాన్నిస్తూ ముందుకు క దులుతున్నట్టనిపించింది. 'ఎంత అద్భుతమైన దృశ్యం.' అది నిజమ న్నట్టుగా గుడిలో గంటలు మోగు తున్నాయి.

దుర్గాష్టమి ఇంకా మూడురోజులుంద నగా ఒకరోజు ఇందిర భర్తతోపాటు టీ తాగుతూ టివి ముందు కూర్చుంది. ఎనిమిదేళ్ళ కూతురు 'దీప' పరిగెత్తు కుంటూ వచ్చింది.

"నాన్నా! బతుకమ్మ పండగకు సౌమ్య పట్టులంగా కుట్టించుకుంది. నాకూ కొనివ్వు" అడిగింది.

"మీ అమ్మనడుగు" నవ్వుతూ అన్నాడు.

"కొనిస్తానులేతల్లీ! నువ్వుకూడా పట్టు లంగా కట్టుకొని బతుకమ్మ ఆడడానికి వెళ్దువుగాని" ఇందిర హామీ ఇచ్చింది.

ఎదురుచూస్తున్నరోజు రానేవచ్చింది. ఇందిర పొద్దున్నే తలంటుకుని రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, దానిపైన తమలపాకులో పసుపు గౌరమ్మనుచేసి, పూజచేసి పాయసం నైవేద్యం పెట్టింది. వంట హడావుడి లేదు. భోజనాలకు వరలక్ష్మి వాళ్ళు పిలిచారు. వరలక్ష్మి వాళ్ళింట్లో పెద్దమ్మ రకరకాల పులిహోరలు చేసింది. అసలు పులిహోరలు అన్నిరకాలుగా చేయొచ్చని తనకిక్కడికి వచ్చాకనే తెలిసింది.

"ఇన్నిరకాల పులిహోరలెందుకు పెద్ద మ్మా!" అడిగింది.

"బతుకమ్మకు పులిహోరలిష్టమం టరు. మేం పులిహోరలను "సద్దులు" అనిగూడ అంటము. అందుకే ఈ పండుగను "సద్దుల పండుగ" అని గూడ అంటరు"-

పెద్దమ్మ చేసిన పులిహోరలను కడుపునిండా తిని ఇంటికి వచ్చేసారు. సాయంత్రం కాగానే పాపను తయారు చేసి, తనుకూడా పట్టుచీర కట్టుకొని తయారై వరలక్ష్మి ఇంటికి వెళ్ళింది. ఆకుపచ్చ పట్టుచీరలో, ఒంటినిండా నగలతో వరలక్ష్మి పేరుకు తగ్గట్టు లక్ష్మీ దేవిలానే ఉంది.

"తొందరగ బతుకమ్మలను తీస్కొని పోండ్రి. తయారైనంత సేపుగూడ ఆడరైతిరి" పెద్దమ్మ విసుక్కుంది.

"వదినమ్మా! భద్రకాళి చెరువు దూరంగదా. ఇవాళ చెరువు కట్టమీద బతుకమ్మ ఆడాలె. అందుకని జీపుల బెట్టుకొని పోదాం. మీ అన్నయ్య జీపు పంపిస్తనన్నడు" అంది.



వాళ్ళ బతుకమ్మ మరీ పెద్దగా ఉంది. రంగులలో ముంచి తీసిన గునుగు పూలు, తంగేడు, గుమ్మడి, బంతి, చామంతి, వావిలి, గన్నేరు, గులా బి, పట్టుకుచ్చు లు వంటి రకరకాల పూల తో బతుకమ్మ అందంగా, ఆకర్షణీయంగా ఉంది. వాయనాలకు పెద్దమ్మ నువ్వులపొడి, మినపసున్ని, కొబ్బరి బెల్లం, పెసరసున్ని, వేరుసెనగ పొడి అన్నింటినీ కట్టించింది. జీపులో బతకమ్మలను పెట్టుకొని భద్రకాళి చెరువుదగ్గర కెళ్ళారు. విపరీతమైన రద్దీ. రంగు రంగుల పట్టుచీరలు, నగలతో ఆడవాళ్ళు, పిల్లలు, తమ వారికోసం వచ్చిన మగవాళ్ళు, జనాన్ని కంట్రోలు చేయడానికి వచ్చిన పోలీసు లతో ఆ ప్రాంతమంతా ఇసుకవేసినా రాలనట్టుగా ఉంది. వరలక్ష్మి, ఇందిర వాళ్ళు అతి కష్టంమీద బతుకమ్మలను తీసుకొని ఒక గుంపులో చేరారు.

"శ్రీలక్ష్మిదేవియు ఉయ్యాలో
సృష్టి బతుకమ్మయ్యె ఉయ్యాలో
ధరచోళదేశాన ఉయ్యాలో
ధర్మాంగుడను రాజు ఉయ్యాలో"

ఎవరో ఒక యువతి బతుకమ్మ పుట్టుక, వివాహం, పూజావిధానం అన్నింటినీ పాట ద్వారా శ్రావ్యంగా చెప్తోంది. రామాయణ, భారతాలలోని వివిధ అంశాలు, ఇతర విషయాలెన్నిం టినో బతుకమ్మ పాటల రూపంలో చెప్పడం ఇందిరకు ఆశ్చర్యాన్ని కలిగిం చింది. అంతేగాక, కులమతాలకు, ధనిక, పేద వర్గాల తేడాలకు అతీతం గా అందరూ ఒకచోట చేరి 'బతుకమ్మ' ను ఆడడం మరింత ఆశ్చర్యాన్ని కలిగిం చింది. సుమారు ఏడుగంటల ప్రాంతం లో ఒక్కొక్కరు బతుకమ్మలను తీయడం ప్రారంభించారు. ప్రమిదలలో నూనె దీపాలను వెలిగించి, బతుకమ్మపైన ఉంచి అందరూ గుంపులుగా నీటిలో వదిలారు. గట్టుపై నిల్చొని చూస్తున్న ఇందిరకు విశాలమైన భద్రకాళి చెరువు లో దేదీప్యమానంగా వెలుగుతున్న దీపాలతో, రంగురంగుల పూలతో చేసిన బతుకమ్మలు మానవాళికి ఏదో సందేశాన్నిస్తూ ముందుకు కదులుతున్న ట్టనిపించింది. 'ఎంత అద్భుతమైన దృశ్యం.' అది నిజమన్నట్టుగా గుడిలో గంటలు మోగుతున్నాయి. స్త్రీలు బొట్టు పెట్టుకుని పరస్పరం వాయినాలు పంచుకున్నారు. మనసునిండా సంతృ ప్తితో, ఏదో చెప్పలేని అద్భుతమైన అనుభూతితో ఇల్లు చేరింది ఇందిర.

"అసలు ఇంత మంచి పండగని తెలంగాణాలో మాత్రమేకాక ఆంధ్ర ప్రదేశ్ అంతటా, ఆ మాటకొస్తే ఇతర రాష్ట్రాలలో కూడా ఆచరిస్తే ఎంత బాగుంటుంది. అందరూ కూడా తాను పొందిన అనుభూతిని, సంతృప్తిని పొందవచ్చు కదా" అనుకుంది.

ఉద్యోగరీత్యా భర్తకు ఎక్కడికి ట్రాన్స్ ఫర్ అయినాసరే బతుకమ్మ పండగకు మాత్రం కచ్చితంగా ఇక్కడికే రావాలని నిశ్చయించుకుంది. 'ఔను ఇంత మంచి అనుభూతిని తాను పోగొ ట్టుకోలేదు' అందుకే ప్రతి సంవత్సరం కచ్చితంగా బతుకమ్మ పండగని ఆచ రించే అదృష్టం ఇమ్మని భద్రకాళిని మనసులో వేడుకుంది. ●

## కాసింత శ్రద్ధ పెడితే రెట్టింపు సౌందర్యం!



అందంగా ఉండడం వేరు. అందంగా కనిపించాలనుకోవడం వేరు. అందంగా ఉన్నా అందం రెట్టింపు కావా లంటే మాత్రం శ్రద్ధ అవసరం. ఈకా లపు అమ్మాయిలు కేవలం చీరలకే పరి మితం కాకుండా దుస్తుల విషయంలో మరికొంచెం ముందుకెళ్ళారు. వారి మేకప్, దుస్తులు, కట్టుబొట్టు అన్నీ ఆయా ప్రాంతాలకు, సీజన్‌లకు అను గుణంగా మార్చుకుంటున్నారు. అయితే అందంగా, ఆకర్షణీయంగా కనిపించా లంటే ఖరీదైన దుస్తులు, ఆభరణాలే అక్కర్లేదు. సూక్ష్మంలో మోక్షంలా ఈ కింది కొన్ని సూచనలు పాటిస్తే మధ్య తరగతి మహిళలు కూడా అందంగా కనిపిస్తారు.

* ముందు మీరు చేయాల్సింది మీ ఒంటికి నప్పే రంగులో తగిన డ్రెస్సును ఎంపిక చేసుకోవడం. మీ ఒంటి రంగుకు, మీ పర్సనాలిటీకి తగినవిధంగా డ్రెస్సు వుండాలన్న ముఖ్యవిషయాన్ని మాత్రం మర్చిపోవద్దు.

* లైట్ ప్రింట్స్, లైట్ కలర్స్ డ్రస్సులు వేసుకొంటే మనసుకు, శరీరానికి హాయిగా, చల్లగా ఉంటుంది. అటువంటి దుస్తులు ధరించినవారిని చూసినవారి కళ్ళకు హాయిగా వుంటుంది.

* కంటికి కొట్టొచ్చినట్టు కనిపించే రంగులు యువతరానికి బాగుంటాయి. తేలికరంగులు, తక్కువ షేడ్స్ వున్న దుస్తులు కొంచెం పెద్ద వయస్సువారికి బాగుంటాయి.

* అందరి దృష్టి మీమీద వుండాలి. మీ అందాన్ని, పర్సనాల్టీని, మీ డ్రస్సింగ్‌ను అందరూ మెచ్చుకొనేలా వుండాలి. ఇదే మీ లక్ష్యమయితే వస్త్రధారణ విషయంలో శ్రద్ధ కనబరచండి.

* డ్రస్సుల ప్రింట్స్‌ను సెలెక్ట్ చేసుకొనేప్పుడు మీ శరీర ఎత్తును దృష్టిలో పెట్టుకో వాలి. పొడుగ్గా వుండే మహిళలకు చెక్స్, నిలువుగీతలు, అడ్డగీతలు, పెద్ద బోర్డరు వున్న చీరలు బావుంటాయి.

* పొట్టిగా వున్నవారు చిన్న ప్రింట్స్ చీరలు, నిలువు గీతలు, చిన్నచిన్న బోర్డరు వున్న చీరలు ధరిస్తే మంచిది. అలాగే చుడీదార్‌లు కూడా ఎంచుకోవాలి.

* ఒక్క డ్రస్సులోనేకాక మహిళలు వాడే మనీ పర్సులు, పాదరక్షలు, నగలను బట్టి కూడా వారి అందం ద్విగుణీకృతమవుతుంది. మనం వేసుకొనే డ్రస్సుకు అను గుణంగా నగలు, పాదరక్షలు ధరిస్తే చూడచక్కగా వుంటుంది. కనక అమ్మాయిలూ, మీ దుస్తులు, నగల విషయంలో మీ మేని ఛాయకు, మీ పర్సనాల్టీకి సరిపడినవి ఎంచుకుంటారుకదా!

**- వై.వసంత**



2